రుణమాఫీకి వివరాల సేకరణ

కులకచర్ల, ఆగస్టు 30: రుణమాఫీ కాని రైతుల వివరాలను సేకరిస్తున్నట్లు ఏవో వీరస్వామి తెలిపారు. శుక్రవారం పుట్టపహడ్‌లో రుణమాఫీ కాని రైతుల వివరాలను సేకరించారు. మండల పరిధిలో రుణమాఫీ కోసం 220 మంది రైతుల దరఖాస్తు చేసుకున్నారన్నారు. రూ.2 లక్షలలోపు 170 మంది, రూ.2లక్షలకుపైగా 50 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు.

చెరువు శిఖం..

కనిపిస్తే ఖతం

యథేచ్ఛగా చెరువులు, కుంటలు ఆక్రమణ

ఉమ్మడి జిల్లాలో భూ కబ్జాల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. బడా రాజకీయ నేతలు, రియల్టర్లు చెరువు, కుంటలను మింగేస్తున్నారు. కబ్జాకు కావేవి అనర్హం అన్నట్టుగా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, నాలాలను ఆక్రమించి వాటి ఉనికి లేకుండా సవాల్ విసురుతున్నారు. భవనాలు, హాస్టళ్లు, హోటళ్ల వంటి పెద్దపెద్ద నిర్మాణాలు చేపట్టారు. ఫలితంగా వర్షాకాలంలో చెరువులు, కుంటలు, వాగుల్లోకి చేరాల్సిన నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడ్చల్, శామీర్‌పేట, ఘట్‌కేసర్ మండలాల్లో భారీగా అక్రమ నిర్మాణాలు వెలిశాయి. గత ప్రభుత్వ హయాంలో వీటిపై ఎన్ని ఫిర్యాదులు వచ్చినా అధికారులు ఉదాసీనంగా వ్యవహరించారు. ప్రస్తుతం హైడ్రా రాకతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో కబ్జాలు, ఆక్రమణలపై నేటి నుంచి ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనాలు..

- మేడ్చల్, శామీర్‌పేట, ఘట్‌కేసర్ ప్రాంతాల్లో అత్యధికం
- మాజీమంత్రి మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డిల కబ్జాల పర్వం
- ఇష్టారీతిన కాలేజీలు, హోటళ్ల నిర్మాణాలు
- చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుల వెల్లువ
- 'హైడ్రా' రాకతో ఆక్రమణదారులు ఉక్కిరిబిక్కిరి



పెద్ద చెరువులో అధికారులు కూల్చివేసిన ప్రహరీ (ఫైల్)

బొమ్మరాశిపేటలో..

బొమ్మరాశిపేట పెద్ద చెరువు దాదాపు 129.5 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ చెరువుకు సంబంధించిన సర్వేనం. 408లోని దాదాపు 6 ఎకరాల బఫర్ జోన్ పరిధిలోని భూమిని మాజీ మంత్రి మల్లారెడ్డి కొనుగోలు చేశాడు. కాగా ఈ భూమికి మల్లారెడ్డి చుట్టూ ప్రీ కాస్ట్ వాల్ నిర్మించగా ఈ ఏడాది మే నెలలో ఇరిగేషన్ శాఖ అధికారులు తొలగించారు.

ఎదులాబాద్‌లో

ఓ రియల్‌వ్యాపారి ఘనాపూర్ పంచాయతీ, ఎదులాబాద్ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్లు 1182, 1185, 1186, 1187, 1188లోని భూమితో పాటు ఏకంగా చెరువు ఎఫ్‌టీఎల్‌ను ఆక్రమించి మట్టితో నింపారు. దాదాపు రెండుమూడు ఎకరాల వరకు ఎఫ్‌టీఎల్ పరిధి దాటి మట్టితో చదును చేశారు. రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నా తీరుమాత్రం మారలేదు. మళ్లీ యథేచ్ఛగా మట్టితో నింపారు.



మైసమ్మగూడలో నీట మునిగిన భవనాలు (ఫైల్)

మేడ్చల్ ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు చుట్టూ విస్తరించి ఉన్న మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో భూములు చాలా విలువైనవి. చెరువుల స్థలాలు, ఎఫ్‌టీఎల్‌లు, బఫర్‌జోన్‌లు, నాలాలు కబ్జాకు కావేవి అనర్హం అంటూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి మల్లారెడ్డి, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిల భూబాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. భారీ కాలేజీ భవనాలు, హాస్టళ్లు, హోటల్ వంటి పెద్దపెద్ద నిర్మాణాలు చేపట్టి యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడ్డారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో అక్రమనిర్మాణాలతో చెరువులు, కుంటల ఉనికే కనుమరుగయ్యే పరిస్థితి వచ్చింది. గతప్రభుత్వ హయాంలో ఫిర్యాదులు అందినప్పటికీ అధికారులు చూసీచూడనట్లుగా ఉన్నారు. చెరువు శిఖం, బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ పరిధిల్లోనూ యథేచ్ఛగా నిర్మాణాలు చేపట్టారు. ఫలితంగా వర్షాకాలంలో చెరువులు, కుంటలు, వాగుల్లోకి చేరాల్సిన నీరు రహదారులపై ప్రవహిస్తోంది.

కబ్జాల పర్వం 1

నాడెం చెరువు

వెంకటాపూర్‌లోని నాడెం చెరువు కొర్రెముల రెవెన్యూ పరిధి సర్వేనెంబర్లు 814, 816లలో 62 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. అయితే గాయత్రి ఎడ్యుకేషన్ ట్రస్టు, అనురాగ్ విద్యాసంస్థ యాజమాన్యం ఈ చెరువు పక్కనే ఉన్న సర్వే నంబరు 813లోని భూమిని కొనుగోలు చేసి చెరువు బఫర్‌ను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. దీనిపై ఇరిగేషన్ అధికారులు పోచారం ఐటీసీ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. సమాజంలో బడానాయకులు, రియల్ వ్యాపారులే చెరువులు, కుంటలు, బఫర్‌జోన్‌లను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిని సంరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

హైడ్రాతో కబ్జాదారుల్లో వణుకు

రాష్ట్ర ప్రభుత్వం మహానగర విస్తరణకు అనుగుణంగా ప్రజలకు విస్తృత సేవలు అందించేందుకు హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ అథారిటీ(హైడ్రా) ఏర్పాటు చేసింది. అది ఇప్పటికే కార్యాచరణ మొదలుపెట్టింది. గుండ్లపోచంపల్లి మున్సిపల్ మైసమ్మగూడలో, ఘట్‌కేసర్ మండలంలో పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సంబంధించిన సంస్థల ఆక్రమణలపై ఇప్పటికే హైడ్రాకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. మైసమ్మగూడలోని మాజీ మంత్రి మల్లారెడ్డికి చెందిన భవనాలను ఇప్పటికే పరిశీలించినట్లు సమాచారం. త్వరలోనే కూల్చివేతలకు హైడ్రా అధికారులు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. ఇందుకోసం ప్రత్యేకంగా డిమాలిషన్ బృందాలను హైడ్రా సిద్ధం చేసినట్లు తెలిసింది. త్వరలోనే పెద్ద ఎత్తున కూల్చివేతలకు రంగం సిద్ధం చేయడంతో పాటు 3, 4 రోజుల పాటు కూల్చివేతలు ఉండనున్నట్లు సమాచారం.



మైసమ్మగూడలో నాలాపై నిర్మించిన రోడ్డు, భవనాలు

బఫర్ జోన్లో కబ్జా

మేడ్చల్ జిల్లా, ఘట్‌కేసర్ మండలం, ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు దాదాపు 600 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుంది. గతంలో ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చెరువు చుట్టూ ఎఫ్‌టీఎల్ హద్దులు నాటారు. కానీ కొందరు మాత్రం చెరువు పక్కన ఉన్న భూములను కొనుగోలు చేసి యథేచ్ఛగా బఫర్‌జోన్ కాకుండా ఏకంగా ఎఫ్‌టీఎల్ పరిధిలో సైతం మట్టి పోసి చదును చేశారు. చెరువు వైశాల్యాన్ని తగ్గిస్తున్నారు. ఘనాపూర్ పంచాయతీ, ఎదులాబాద్ రెవెన్యూ పరిధి సర్వే నెంబర్లు 1154, 1155, 1156లోని భూమిని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సీఎంఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ పేరుతో కొనుగోలు చేశారు. చెరువుకు 30 మీటర్ల దూరం బఫర్‌జోన్ వదిలి పెట్టాలనే నిబంధనలు తుంగలో తొక్కారు. సీఎంఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ యాజమాన్యం మాత్రం ఏకంగా బఫర్‌జోన్‌ను కబ్జాచేసి మట్టితో నింపారు. రెవెన్యూ అధికారులు గతంలో వాహనాలను సైతం సీజ్ చేశారు.



ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టితో నింపిన ప్రదేశం

మైసమ్మగూడలో..



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపల్ మైసమ్మగూడ పరిధిలో మాజీ మంత్రి మల్లారెడ్డికి చెందిన ఇంజనీరింగ్ కాలేజీలు, యూనివర్సిటీపై హైడ్రాకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. మైసమ్మగూడలో ఎటు చూసినా మల్లారెడ్డికి చెందిన భవంతులే కనిపిస్తాయి. మల్లారెడ్డికి చెందిన పలు భవనాల నిర్మాణాలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు ఉన్నప్పటికీ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంత్రిగా ఉండటంతో ఫిర్యాదులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు ఆసక్తి చూపలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన హైడ్రా ఇటీవల నగరంలోని పలు ప్రాంతాల్లో పెద్ద పెద్ద భవనాలను సైతం నేలకూల్చివేస్తోంది. దీనితో మైసమ్మగూడలోని మల్లారెడ్డికి చెందిన ఇంజనీరింగ్ కాలేజీలు, యూనివర్సిటీపై పెద్ద ఎత్తున హైడ్రాకు ఫిర్యాదులు అందుతున్నాయి. ముఖ్యంగా మైసమ్మగూడలోని కోమటికుంట అలుగులపై నిర్మించిన మల్లారెడ్డి హాస్టల్ భవనంపై అనేక మార్లు ఫిర్యాదులు వచ్చాయి. దీని కారణంగా గత ఏడాది వర్షాకాలంలో పెద్ద ఎత్తున కురిసిన వర్షాలకు మైసమ్మగూడలోని కాలేజీలు, హాస్టళ్లలో వర్షపు నీరు చేరి ఇబ్బందులు పడ్డారు. . కొన్ని హాస్టల్ భవనాలు సగం వరకు మునిగిపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. పోలీసులు, మున్సిపల్ అధికారులు రిస్క్ చేసి భవనాల్లో చిక్కుకుపోయిన విద్యార్థులను జేసీబీ, ట్రాక్టర్ల ద్వారా బయటకు తీసుకువచ్చారు. దీంతో పాటు మైసమ్మగూడలోని పలు ఇంజనీరింగ్ కాలేజీ భవనాలు కూడా అక్రమంగా నిర్మించారనే ఫిర్యాదులు ఉన్నాయి. గతంలో మల్లారెడ్డి యూనివర్సిటీ కోసం పక్కనే ఉన్న హెచ్ఎండీఏ వెంచర్‌లో పార్కు స్థలం నుంచి రాత్రికి రాత్రే రోడ్డు వేశారు. ప్రభుత్వం మారిన తర్వాత రోడ్డును తొలగించినప్పటికీ మైసమ్మగూడలో విచారణ చేపడితే మల్లారెడ్డి అక్రమ నిర్మాణాలు పెద్ద ఎత్తున వెలుగులోకి రానున్నాయి.

శామీర్‌పేటలో..



శామీర్‌పేట పెద్ద చెరువు బఫర్ జోన్‌లో నిర్మాణం

జిల్లాలోనే అతి పెద్దది శామీర్‌పేట పెద్ద చెరువు. ఈ చెరువు దాదాపు 1200 ఎకరాల్లో విస్తరించి ఉంది. దీని కింద దాదాపు 7 వేల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. అలియాబాద్ చౌరస్తా సమీపం వరకు ఈ పెద్ద చెరువు నీటితో నిండి విస్తరించి ఉంది. కాగా అలియాబాద్ చౌరస్తా వద్ద దాదాపు ఏడేళ్ల క్రితం మాజీ మంత్రి మల్లారెడ్డి దాదాపు 10ఎకరాల పట్టా భూమిని కొనుగోలు చేశాడు. కాగా ఈపట్టా భూమికి ఆనుకుని శామీర్‌పేట పెద్ద చెరువు ఉంది. నాలుగేళ్ల క్రితం దాదాపు 2 నుంచి 3 ఎకరాల మేరకు చెరువు బఫర్‌ను దర్జాగా కబ్జా చేశాడు. మట్టిపోసి ఎత్తు పెంచి ఆక్రమించాడు.



అనంతగిరికి మహర్దశ

- నేచర్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు
- హెల్త్, ఎకో, టెంపుల్ టూరిజం కేంద్రంగా అభివృద్ధి
- ప్రత్యేకంగా దృష్టి సారించిన సీఎం రేవంత్‌రెడ్డి

వికారాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : అనంతపద్మనాభస్వామి కొలువుదీరిన అనంతగిరి కొండలను ఎకో, హెల్త్, టెంపుల్ టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అనంతగిరిని ఇప్పటికే ఎకో టూరిజంగా అభివృద్ధి పరిచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుండగా, తాజాగా టెంపుల్, హెల్త్ టూరిజంగా కూడా అభివృద్ధి పరిచేందుకు ప్రణాళికలు రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి టూరిజం అభివృద్ధి ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖల మంత్రులు, అధికారులు, తదితరులతో సమావేశమైన సీఎం టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, హెల్త్ టూరిజయం అభివృద్ధికి విడివిడిగా పాలసీలు రూపొందించాలని ఆదేశించారు. ప్రాచీన దేవాలయాలు, చారిత్రక స్థలాలతో పాటు అటవీ ప్రాంతాలు, వైద్య సదుపాయాలు పర్యాటకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని, రవాణా సదుపాయంతో పాటు వసతులు, పర్యాటకులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఉండే విధంగా కొత్త టూరిజం ప్యాకేజీలు ఉండాలని స్పష్టం చేసిన నేపథ్యంలో అనంతగిరి కొండలు ఎకో టూరిజంతో పాటు హెల్త్, టెంపుల్ టూరిజం కేంద్రంగా అభివృద్ధి చెందడానికి పుష్కలమైన అవకాశాలు కనిపిస్తున్నాయి. అనంతగిరిలో ప్రస్తుతం హరిత హోటల్ మినహా పర్యాటక పరంగా ఇతర అభివృద్ధి కనిపించడం లేదు. ఈ నేపథ్యంలోనే హరిత హోటళ్లు, వసతి గృహాలు నిర్మించి వదిలేయకుండా వాటిని పర్యాటకలను ఆకట్టుకునే విధంగా వాటి నిర్వహణ బాగుండేలా ప్రత్యేకంగా దృష్టి సారించాలని సీఎం సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. కేవలం మౌలిక సదుపాయాల పరంగా అభివృద్ధి చేస్తే సరిపోదన్నారు. అనంతగిరి కొండలను ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి పరిచేలా ప్రణాళికలు రూపొందించనున్నారు. పర్యాటకపరంగా అభివృద్ధి చెందితే ఉద్యోగాల కల్పనకు కూడా ఎంతగానో దోహదపడనుంది.

200 ఎకరాల్లో హెల్త్ టూరిజం

ఆరోగ్యాన్ని ఇచ్చే అద్భుతమైన ఆయుర్వేద మొక్కలు, ప్రకృతి సంపద ఉన్న అనంతగిరి కొండల్లో 200 ఎకరాలను హెల్త్ టూరిజం కోసం వినియోగించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. బెంగళూరులోని జిందాల్ నేచర్ క్యూర్ ఇనిస్టిట్యూట్ తరహాలో నేచర్ వెల్‌నెస్ సెంటర్ అనంతగిరిలో ఏర్పాటు చేయాలనే నిర్ణయం తీసుకున్నారు. వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు జిందాల్ సంస్థ ప్రతినిధులతో పాటు ప్రకృతి వైద్య రంగంలో పేరొందిన ప్రముఖ సంస్థల బాధ్యులతో చర్చించనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియ త్వరలో ప్రారంభం కానున్నట్లు తెలిసింది.

శివసాగర్‌లోకి మురుగు రాకుండా చూడాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, ఆగస్టు 29 : శివసాగర్ ప్రాజెక్టులోకి మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వికారాబాద్ మునిసిపల్ పరిధిలోని శివసాగర్ ప్రాజెక్ట్ అనుసంధాన కాలువను, మార్కెట్ యార్డులో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ దుకాణాల సముదాయాన్ని మునిసిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్, కమిషన్ జాకీర్ అహమ్మద్, సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ. ప్రజల నిత్యావసరాలకు వికారాబాద్ మునిసిపాలిటీకి తాగునీరు అందించే శివసాగర్ ప్రాజెక్టులోకి నీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. పూడూరు మండల పరిధిలోని కొన్ని ప్రాంతాల్లోని గ్రామాల నుంచి వచ్చే మురుగునీరు ప్రాజెక్ట్‌లోకి రావడం వల్ల జరిగే ప్రమాదాన్ని గుర్తించిన కలెక్టర్ మురుగునీటిని కాలువల ద్వారా మళ్లించేందుకు చేపట్టాల్సిన పనులకు ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుందర్‌ను కలెక్టర్ ఆదేశించారు. ప్రాజెక్టులో పేరుకుపోయిన ప్లాస్టిక్, చెత్తాచెదారాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. మార్కెట్ యార్డులో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్‌ను సందర్శించిన కలెక్టర్ సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన చేపట్టి చిరు వ్యాపారులకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు.

బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లను తరలించాలి

బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లను ఈవీఎంల గిడ్డంగికి తరలించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు. శుక్రవారం మార్కెట్ యార్డులో చేవెళ్ల పార్లమెంటరికీ సంబంధించిన బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లను భద్ర పరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల సీళ్లను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారుల సమక్షంలో తెరిచారు. వికారాబాద్, తాండూరు, పరిగి శాసన సభ నియోజకవర్గాల బ్యాలెట్, కంట్రోల్ యూనిట్‌లను జాగ్రత్తగా పట్టణ కేంద్రంలోని ఈవీఎంల గిడ్డంగికి తరలించి భద్రపర్చాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కలెక్టర్ తో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీవోలు వాసు చంద్ర, శ్రీనివాస్ రావు, తహసీల్దార్ లు లక్ష్మీనారాయణ, తారా సింగ్, ఆనంద్ కుమార్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నయామత్ అలీలు ఉన్నారు.



మార్కెట్‌యార్డు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

నిమజ్జనాలకు ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనాలను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో నిర్వహించాలని కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వినాయక నిమజ్జన ఏర్పాట్లపై నిర్వహించిన సమన్వయసమావేశంలో అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, రాధికా గుప్తా, రాచకొండ డీసీపీ కరుణాకర్, డీఆర్‌ఓ హరిప్రియలతో కలిసి కలెక్టర్ గౌతమ్ మాట్లాడారు. జిల్లాలో మొత్తం 17 చెరువులు ఉన్నాయని, వాటిలో వినాయక నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. నిమజ్జనాలకు అవసరమైన రూట్ మ్యాప్ సైతం సిద్ధం చేసుకోవాలని సూచించారు. అవసరమైన చోట్ల రోడ్ల మరమ్మత్తు పనులు చేపట్టాలని ఆర్ అండ్ బి అధికారులకు సూచించారు. చెరువుల వద్ద వైద్య శిబిరాలు, అంబులెన్స్ సౌకర్యం, గజఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, భారీ క్రేన్‌లను ఏర్పాటు చేయాలన్నారు. నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద అవసరమైన మరుగుదొడ్లను ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సందర్భంగా భాగ్యనగర్ ఉత్సవ కమిటీ సభ్యులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో పోలీసు, మత్స్య, వైద్య, అగ్నిమాపక, ఆర్ అండ్ బి, కాలుష్య నియంత్రణ, విద్యుత్తు, జలమండలి అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

తిరుపతికి వెళ్లే విమానం ఆలస్యం

ఆందోళన చేపట్టిన ప్రయాణికులు

శంషాబాద్, ఆగస్టు 30: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి శుక్రవారం సాయంత్రం తిరుపతికి వెళ్లాల్సిన స్పైస్ జెట్ విమానంలో సాంకేతిక లోపం కారణంగా రాత్రి వరకు బయల్దేరకపోవడంతో అందులో వెళ్లాల్సిన ప్రయాణికులు ఎయిర్‌పోర్టులో ఆందోళన చేపట్టారు. షెడ్యూల్ ప్రకారం సాయంత్రం 6.30 గంటలకు తిరుపతి వెళ్లాల్సిన విమానంలో సాంకేతిక లోపం ఏర్పడడంతో టేకాఫ్ కాకుండా నిలిపివేశారు. విమానంలోని లోపాన్ని సరిచేయించాక బయల్దేరుతుందని ప్రకటించడంతో ప్రయాణికులు ఎయిర్‌పోర్టులోనే ఉండిపోయారు. రాత్రి 10 గంటల వరకు కూడ బయలుదేరకపోవడంతో తమకు ఏదైనా ప్రత్యామ్నాయంగా విమానం ఏర్పాటు చేశాయాలని ఆందోళనకు దిగారు. అయితే ఎయిర్‌పోర్టు వర్గాలు ప్రయాణికులకు సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నట్లు సమాచారం.

మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



సమావేశంలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర రూరల్, ఆగస్టు 30: మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశానికి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ వార్డుకు రూ.30లక్షల చొప్పున, వినాయక చవితి, బతుకమ్మ ఉత్సవాలు, తదితర పనుల నిర్వహణకు రూ.9లక్షల కేటాయిస్తూ కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. అనంతరం స్థానికంగా ఉన్న సాయిభవాని ఫంక్షన్‌హాల్‌లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులు 54మందికి చెక్కులను అందజేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ వసుపతి ప్రణీత, కమిషనర్ నాగమణి, వైస్‌ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మేనేజర్ వెంకటేశం, మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్ సీఐగా నవీన్‌కుమార్



మోమిన్‌పేట్, ఆగస్టు 30: మోమిన్‌పేట్ సర్కిల్ సీఐగా నవీన్‌కుమార్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతల స్వీకరించారు. ఇక్కడ పని చేసిన సీఐ ఆంజనేయులు బదిలీ కావడంతో ఆయన స్థానంలో నవీన్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో నూతన సీఐ నవీన్‌కుమార్ ఎస్పీ నారాయణరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.



బండవెల్కిచర్ల గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల

గురుకులంలో చేరేందుకు విద్యార్థుల అనాసక్తి

కులకచర్ల, ఆగస్టు 27: మండలంలోని బండవెల్కిచర్ల గిరిజన సంక్షేమ గురుకుల బాలుర కళాశాల మొదటి సంవత్సరంలో చేరేందుకు విద్యార్థులు ఉత్సాహం చూపడం లేదు. దీంతో ఆయా గ్రూపుల్లో సీట్లు ఖాళీగా ఉంటున్నాయి. ఆన్‌లైన్ కౌన్సెలింగ్ పూర్తయింది. రెండుసార్లు నేరుగా డోర్ కౌన్సెలింగ్ నిర్వహించినా సీట్లు భర్తీ కావడం లేదు. ఇక్కడి కళాశాలలో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు ఉన్నాయి. ఒక్కో గ్రూపులో 40సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఎంపీసీ గ్రూపులో 40సీట్లు ఉన్నాయి. ఎంపీసీ గ్రూపులో 30మంది చేరగా ఇంకా 10సీట్లు ఖాళీగా ఉన్నాయి. అదేవిధంగా బైపీసీ గ్రూపులో 18మంది విద్యార్థులు చేరగా 22 సీట్లు ఖాళీగా ఉన్నాయి. కళాశాలలో బోధన, భోజన వసతులు సరిగా లేవనే ఆరోపణలు ఉన్నాయి. నాలుగు సంవత్సరాలుగా ఇంటర్‌లో ఉత్తీర్ణత శాతం తగ్గుతూ వస్తోంది. గత ప్రిన్సిపాల్ పని ఒత్తిడి కారణంగా ఇద్దరు దినసరి వేతన సిబ్బంది ఆత్మహత్య చేసుకున్నారు. తోటి అధ్యాపకులతో ప్రిన్సిపాల్‌కు విభేదాలు ఉన్నట్లు ఆరోపణలున్నాయి. ప్రస్తుతం ఆప్రిన్సిపాల్ మెదక్‌కు బదిలీపై వెళ్లారు. కానీ వేతనం మాత్రం ఇక్కడే పొందుతున్నారు. కళాశాలలో చేరేందుకు వచ్చే విద్యార్థులకు ఇక్కడ జరిగే విషయాలు వివరించి చేరవద్దని ఇక్కడ చదువుతున్న విద్యార్థులే చెబుతున్నట్లు సమాచారం. దీంతో ఇంటర్‌లో చేరేందుకు విద్యార్థులు ఉత్సాహం చూపడం లేదని తెలుస్తోంది.

శస్త్రచికిత్సలకు మళ్లీ బ్రేక్

ఇబ్బంది పడుతున్న రోగులు ● తాండూరుకు డిప్యూటేషన్‌పై మరో సర్జన్



తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి

తాండూరు, ఆగస్టు 30: సాధారణ బదిలీల ప్రభావం తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిపై పడింది. సర్జన్లు, సివిల్ సర్జన్లు బదిలీపై వెళ్లడం వారి స్థానంలో ఇతర సర్జన్లు రాకపోవడంతో శస్త్ర చికిత్సలు నిలిచిపోయాయి. ఈ విషయమై గతంలో ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై అప్పటి జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రదీప్ కుమార్, కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిల అనుమతితో వికారాబాద్ ఆస్పత్రిలో కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న డాక్టర్ అజయ్‌కుమార్ డిప్యూటేషన్‌పై తాండూరుకు బదిలీచేశారు. అయితే ఆయన తాండూరు ఆస్పత్రికి రాకుండా వికారాబాద్ మెడికల్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. దీంతో డీసీహెచ్‌లో బదిలీపై వెళ్లిన సర్జన్‌ను పిలిపించి ఒక రోజు శస్త్ర కిత్సలు చేయించారు. తప్పనిసరి అవసరం దృష్ట్యా పరిగి ఆస్పత్రి నుంచి సర్జన్ డాక్టర్ అంబుప్రసాద్‌ను డిప్యూటేషన్‌పై తాండూరు జిల్లా ఆస్పత్రికి రానున్నారు. సోమవారం విధుల్లో చేరుతారని జిల్లా వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రదీప్ కుమార్ చెప్పారు. ఇదిలా ఉండగా, చిన్నచిన్న సర్జన్లు చేసుకోవడానికి తాండూరు ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య అధికంగా ఉంటుంది. పర్మినెంట్‌గా 24గంటలు అందుబాటులో ఉండే సర్జన్ అవసరముంది. ఇప్పటికైనా పర్మినెంట్ సర్జన్‌ను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీడల్లో గెలుపొందిన అధికారులకు బహుమతులు అందజేత



క్రీడల్లో పాల్గొన్న అధికారులతో అదనపు కలెక్టర్ రాధికా గుప్తా

మేడ్చల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్ కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగులకు నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన అధికారులకు శుక్రవారం అదనపు కలెక్టర్ రాధికా గుప్తా బహుమతులను అందజేశారు. 50 మీటర్ల వాకింగ్, 100 మీటర్ల వాకింగ్, 50 మీటర్ల రన్, 100 మీటర్ల రన్, లెమన్ స్పూన్, మ్యూజికల్ ఛైర్, టగ్ ఆఫ్ వార్, షార్ట్ పుల్, చెస్, వాలీబాల్ , క్రికెట్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌వో హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ భవనానికి స్థలం కేటాయింపు



ఉత్తర్వు పత్రాన్ని ఏసీపీకి అందజేస్తున్న రెవెన్యూ అధికారులు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు30: పోచారం ఐటీసీ పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణానికి శుక్రవారం రెవెన్యూ అధికారులు రెండెకరాల ప్రభుత్వభూమిని కేటాయిస్తూ ఉత్తర్వు పత్రాన్ని మల్కాజ్‌గిరి ఏసీపీ చక్రపాణికి అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కొర్రెముల రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్లు 808లోని 1.20 గుంటలు, 840లోని 20గుంటల ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు పోచారం పోలీస్ స్టేషన్‌కు కేటాయించి ఉత్తర్వులను పోలీసు అధికారులకు అందజేశారు. అనంతరం ఏసీపీ చక్రపాణి, సీఐ రాజువర్మతో కలిసి పోలీస్‌స్టేషన్ నూతన భవనానికి శంకుస్థాపన చేశారు. ప్రజల భద్రత విషయంలో ప్రజలకు పోలీసులు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటారని ఏసీపీ తెలిపారు. ఆపదలో ఉన్నప్పుడు 100కు డయల్ చేయాలని సూచించారు. త్వరలో పోలీస్‌స్టేషన్ భవనం నిర్మాణం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు సాయి రామ్, కావ్య, వినయ్‌కుమార్, ఎస్‌ఐలు బద్దం నాగార్జున్‌రెడ్డి, శివకృష్ణ, మాజీ ఎంపీటీసీ నీరుడి రామారావు, నాయకులు నీరుడి శ్రీనివాస్, బుర్ర వెంకటేష్, కట్ట సత్యనారాయణ, వేణుగోపాల్, చింతపంట్ల సత్తయ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నైపుణ్యం పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి

యాలాల, ఆగస్టు 30: ఉపాధ్యాయులు విద్యాబోధనలో నైపుణ్యం పెంపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకా దేవి అన్నారు. మండలంలోని అగ్గనూర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శుక్రవారం కాంప్లెక్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యా వ్యవస్థ బలోపేతానికి ఆధునిక నైపుణ్యాలు అమలు చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సుధాకర్‌రెడ్డి, అగ్గనూర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం సుధాకర్ పాల్గొన్నారు.

మా నేత లేకుండా

చెక్కులు పంచుతారా?



గొడవపడుతున్న బీఆర్‌ఎస్ కాంగ్రెస్ నాయకులు



అధికారులతో కాంగ్రెస్ నేతల వాగ్వాదం

- మేడ్చల్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో నేతల లొల్లి
- వాగ్వాదానికి దిగిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్ శ్రేణులు
- సీఎంకు ఫిర్యాదు చేస్తామన్న అధికార పార్టీ నేతలు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 30: మేడ్చల్ మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అధికారికంగా నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీ నేతలు తీవ్ర వాగ్వాదానికి దిగారు. ఫలితంగా చెక్కుల పంపిణీ కార్యక్రమం ఒక్కసారిగా అట్టుడికిపోయింది. నేతలు ఎందుకు గొడవ పడుతున్నారంటూ అక్కడ ఉన్న వారికి కొద్దిసేపటిదాకా అర్థంకాలేదు. నేతలు మధ్య జరుగుతున్న మాటల యుద్ధం తారాస్థాయికి చేరటంతో చెక్కులు తీసుకోవటానికి వచ్చిన లబ్ధిదారులు నేతల తీరుతో విస్తుపోయారు. తాము ఓటేసి గెలిపించిన ఎంపీ, ఎమ్మెల్యేలు వచ్చినా ఇంకా ఎవరి కోసం నేతలు గొడవ పడుతున్నారంటూ అక్కడున్న లబ్ధిదారులు కాంగ్రెస్ నేతలనే అడిగి తెలుసుకున్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ రాకుండా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించటం పట్ల స్థానిక కాంగ్రెస్ నేతలు అసహనానికి గురవడాన్ని చూసి లబ్ధిదారులు నివ్వెరపోయారు. ఈకార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే చామకూర మల్లా రెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌తో పాటు మేడ్చల్, గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీలకు చెందిన కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు. అధికారికంగా కార్యక్రమం నిర్వహిస్తున్నందున స్థానిక డిప్యూటీ తహసీల్దార్ సాయికుమార్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ చేతులమీదుగా లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేలు తామొచ్చిన పని ముగిసిందంటూ అక్కడ నుంచి వెళ్లారు. అనంతరం కాంగ్రెస్ నాయకులు తమ నేత రాకుండా చెక్కుల పంపిణీ ఎలా చేస్తారంటూ అధికారులపై, బీఆర్‌ఎస్, బీజేపీ నేతలపై మండిపడ్డారు. అధికారిక కార్యక్రమంలో అనధికారిక నేతల పనేందంటూ కొందరు బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్ నేతలకు బదులివ్వటంతో గొడవకు అజ్యం పోసినట్లైంది. అధికార కార్యక్రమాన్ని అధికారులు నిర్వహిస్తారే తప్ప తమ పార్టీ నేతలు కాదని బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు చెప్పడంతో కాంగ్రెస్ నేతలు డిప్యూటీ తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన డిప్యూటీ తహసీల్దార్ అధికారిక కార్యక్రమం కావటంతో తాము లబ్ధిదారులకు, స్థానిక, ఎంపీ, ఎమ్మెల్యేలకు సమాచారం ఇవ్వటంతో పాటు ఇతర ప్రముఖులకు సమాచారం ఇచ్చామని తెలిపారు.

సీఎంకు, జిల్లా ఇన్‌చార్జి మంత్రికి ఫిర్యాదు చేస్తాం

తమ నేత మేడ్చల్ నియోజకవర్గం ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్ లేకుండా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించి తమను అవమానించారని కాంగ్రెస్ నేతలు ఈ సందర్భంగా ఆరోపించారు. ఈ విషయం పట్ల సీఎం, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబుకు ఫిర్యాదు చేస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, మేడ్చల్ మున్సిపల్ మాజీ అధ్యక్షుడు, వేముల శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సంజీవరావు అన్నారు. అధికారంలో ఉన్నా తమను లెక్కచేయని వారి పై చర్యలు తప్పవని హెచ్చరించారు. తమనేత రాకముందే చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఉద్దేశపూర్వకంగా ముగించి ఎంపీ, ఎమ్మెల్యేలు జారుకున్నారన్నారు. కాగా అధికారిక కార్యక్రమం నిర్వహించే బాధ్యత అధికారులపై ఉంటుందని, ప్రొటోకాల్ వర్తిస్తుందని బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.



ఆరు గ్యారెంటీలను పక్కకు పెట్టేందుకే హైడ్రా డ్రామా

రుణమాఫీ అమలులో ఘోరంగా విఫలమైన ప్రభుత్వం

మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 30: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక, పక్కకు పెట్టడానికే హైడ్రాను తెరపైకి తెచ్చిందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు. శుక్రవారం మహేశ్వరంలో రైతు రుణమాఫీపై వ్యవసాయాధికారులతో నిర్వహించిన సమీక్ష అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ప్రధానంగా రైతు రుణమాఫీ ఒకటని, దానిని అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. రైతు రుణమాఫీ విషయంలో ఏ ఒక్క శాఖకు కూడా పూర్తిగా అవగాహన లేదని, రైతుల ఎవరిని అడగాలో తెలియక అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి మాత్రం రైతు రుణమాఫీ రూ.31 వేల కోట్లు అని ప్రచారం చేసుకుంటున్నారని, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాత్రం రూ.7వేల కోట్లు మాఫీ చేశామని చెప్పడం సిగ్గుచేటన్నారు. రైతు బంధును పక్కకుపెట్టి అరకొర రైతు రుణమాఫీ చేయడంతో రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలాగే గ్రామపంచాయతీ వ్యవస్థను అస్తవ్యస్తం చేసి వాటి పాలనను గాలికొదిలేసి గ్రామాల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం చెల్లించలేని స్థితిలో ప్రభుత్వం ఉండడం బాధాకరమన్నారు. మిషన్ భగీరథ, శానిటేషన్ తదితర విషయాల్లో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఒక్క రైతులనే కాదు రాష్ట్రంలో విద్య, వైద్యం వంటి ప్రధాన శాఖలను కూడా ముఖ్యమంత్రి వీధులపాలు చేశాడన్నారు. అభివృద్ధిని పక్కకు పెట్టి హైడ్రాను తెరపైకి తెచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేందుకేనా ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టిందని ప్రశ్నించారు. ఇప్పటివరకు ప్రజలను మోసం చేసింది చాలదన్నట్లు.. మళ్లీ రేషన్‌కార్డులు, హెల్త్ కార్డుల కోసం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహిస్తామని ముఖ్యమంత్రి చెప్పడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికీ ఏ ఒక్కరికీ గ్యాస్ సబ్సిడీ రాలేదని, రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్ తదితర సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ఓ ఒక్క అభివృద్ధి పని మొదలు పెట్టలేదన్నారు. అసెంబ్లీ బడ్జెట్ మీటింగ్‌లో రాష్ట్రంలోని పరిస్థితులపై ముఖ్యమంత్రి అవగాహన లేకుండా మాట్లాడుతున్నాడని సబితారెడ్డి అన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు పాండుయాదవ్, సురేందర్ రెడ్డి, నవీన్, ప్రభాకర్‌రెడ్డి, సుధీర్‌గౌడ్, సమీర్, కె.చంద్రయ్య, రాజునాయక్, కె.ప్రభాకర్, పి.బాలయ్య, ఆదిల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోటమైసమ్మ ఆలయ వార్షికోత్సవం

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 30: షాద్‌నగర్ పట్టణంలోని రైతు కాలనీలో వెలసిన కోటమైసమ్మ ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రత్యేక పూజలు, హోమాలు, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీవాసులతో పాటు పట్టణ ప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరై, అమ్మవారికి భక్తిని చాటుకున్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై పూజ చేసి, అన్నదానం కోసం రూ.11వేలు ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, కౌన్సిలర్ ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు జి.బాల్‌రాజ్‌గౌడ్, చెంది తిరుపతిరెడ్డి, కొంకళ్ళ చెన్నయ్య, సుదర్శన్‌గౌడ్, శివశంకర్‌గౌడ్, అగ్గనూరి బస్వం, కృష్ణారెడ్డి, మురళీమోహన్, కట్ట వెంకటేష్, ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు శుక్రవర్ధన్‌రెడ్డి, ఎండి ఖాజాపాష, వెంకటేశ్వర్‌రెడ్డి, బుచ్చయ్య, మల్లేష్‌గౌడ్, వెంకట్‌రాంరెడ్డి, గోపాల్‌రెడ్డి, నారాయణ రెడ్డి, గంధం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



వార్షికోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, పట్టణ ప్రముఖులు

ఈ పంచాయతీ కార్యదర్శి మాకొద్దు



కులకచర్ల, ఆగస్టు 30: ఈ పంచాయతీ కార్యదర్శి మాకొద్దంటూ కులకచర్ల మండలంలోని గోరిగడ్డతండా ప్రజలు శుక్రవారం వికారాబాద్ డీపీవోకు ఫిర్యాదు చేశారు. తండాకు కొత్తగా వచ్చిన కార్యదర్శి పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని, తాము స్వయంగా ఫిర్యాదు చేసినా తండాకు రావడం లేదని తండావాసులు ఆరోపించారు. తండాలో పారిశుధ్యం లోపించిందని తెలిపినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

మహిళా సంఘాల పనితీరు భేష్

ఎన్ఐఆర్‌డీ ప్రతినిధుల కితాబు



సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న ఎన్ఐఆర్‌డీ బృందం

మహేశ్వరం, ఆగస్టు 30: మహేశ్వరంలో మహిళా సంఘాల పనితీరు చాలా బాగుందని ఈ విధానం దేశంలోని అన్ని రాష్ట్రాల్లో విస్తరింపజేస్తే బాగుంటుందని ఎన్ఐఆర్‌డీ ప్రతినిధుల బృందం కితాబిచ్చింది. శుక్రవారం మండలంలోని మొహబ్బత్‌నగర్‌లో తొమ్మిది రాష్ట్రాలకు చెందిన వివిధ శాఖల 21 మంది ప్రతినిధుల బృందం పర్యటించిది. ఈ సందర్భంగా మహిళా సంఘాల పనితీరు, పుస్తక నిర్వహణ, సంఘాల బలోపేతం మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్న తీరు తదితర అంశాలపై వారిని అడిగి తెలుసుకున్నారు. మహిళలు సంఘాల ద్వారా వివిధ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని అనేక వ్యాపారాలు చేస్తూ రాణించడం అభినందనీయమని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఐఆర్‌డీ మేనేజర్ శ్రీనివాస్, ఎంపీడీవో శైలజ, ఏపీఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో బోనాల వైభవం



బోనమెత్తిన మహిళా ఉద్యోగులు

రంగారెడ్డి అర్బన్, ఆగస్టు 30: గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఘనంగా బోనాల జాతరను జరుపుకున్నారు. మహిళా ఉద్యోగులతో పాటు వారి కుటుంబీకులు పాల్గొనడంతో సందడి వాతావరణం నెలకొంది. డప్పు చప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ బోనాలను తీశారు. కలెక్టరేట్‌లోని నవదుర్గమాత ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి ధూప, దీప నైవేద్యాలను సమర్పించుకున్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, సూపరింటెండెంట్ శివప్రసాద్, ఏవో శారద, సీవోలు శిరీష, ప్రశాంతి, సునంద, మహిళా ఉద్యోగులు శ్వేత, శ్రవంతి, శ్రావ్య, అంబిక, కరుణ, విజయ, మీనాక్షి, రజిత, ఏపీడీలు సక్రియ, చరణ్ గౌతమ్, వెంకట్, నరేష్, పరిశురాం, తదితరులు పాల్గొన్నారు.

సంగెంకలాన్ మైనింగ్ భూముల్లో రెవెన్యూ అధికారుల సర్వే



సంగెంకలాన్‌లో సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది

తాండూరు రూరల్, ఆగస్టు 30: మండలంలోని సంగెంకలాన్ గ్రామ శివారులోని ప్రభుత్వ సర్వేనెంబర్-109/3/3లో 15గుంటల విస్తీర్ణంలో అక్రమ తవ్వకాలు జరుపుతున్నారని ఆ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు శుక్రవారం సర్వే నిర్వహించారు. సంగెంకలాన్ గ్రామానికి చెందిన తిప్పన్న సర్వేనెంబర్-109లో శివారెడ్డి అనే వ్యక్తి 15గుంటల భూమిని కబ్జా చేసుకుని అక్రమ తవ్వకాలు చేస్తున్నారని తిప్పన్న ఇటీవల రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా ఉన్నతాధికారుల ఫిర్యాదు మేరకు అట్టి సర్వే నెంబర్‌ను సర్వే చేసి నివేదిక ఇవ్వాలని జిల్లా రెవెన్యూ అధికారులు తాండూరు తహసీల్దార్ తారాసింగ్‌ను ఆదేశించారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు తాండూరు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గోపి, మండల సర్వేయర్ మహేష్‌లు క్షేత్రస్థాయిలో పర్యటించి, ఆ సర్వే నెంబర్‌కు సంబంధించిన సమగ్ర వివరాలను సేకరించి సర్వే నిర్వహించారు. శివారెడి అనే వ్యక్తి ఏ మేరకు కబ్జా చేశాడు, ఎంత విస్తీర్ణంలో కబ్జా చేశారు, తవ్వకాలు ఏ మేరకు జరిపారనే విషయాలను రెవెన్యూ అధికారులు సమగ్రంగా సేకరించారు. అట్టి వివరాలను క్రోడీకరించి జిల్లా రెవెన్యూ అధికారులకు నివేదించనున్నట్లు తహసీల్దార్ తారాసింగ్ తెలిపారు. ఆయన వెంట రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలి



సిబ్బందితో మాట్లాడుతున్న టీఎస్ఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 30 : డెంగీ పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్, మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ ఎండీ హేమంత్ వైద్యాధికారులకు సూచించారు. శుక్రవారం సాయంత్రం ఆయన ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీని సందర్శించి వైద్యాధికారులతో రివ్యూ చేశారు. డెంగీ, మలేరియా, విష జ్వరాల కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో సౌకర్యాలపై ఆరా తీశారు. అన్ని రకాల మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉండేట్లు చూడాలన్నారు. అదేవిధంగా వైద్యులు 24 గంటలు రోగులకు అందుబాటులో ఉండాలని, లేదంటే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.

కొత్త మోటార్ వెహికిల్ చట్టాన్ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న దేవేందర్

మొయినాబాద్ రూరల్, ఆగస్టు 30: కొత్త మోటార్ వెహికిల్ చట్టాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామ నూతన ఆటో యూనియన్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా మహేందర్, చెన్నయ్యలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో దేవేందర్ పాల్గొని మాట్లాడుతూ ఎంవీ యాక్టు ప్రకారం విపరీతమైన చల్లాన్లను ఆటో కార్మికులు ఎదుర్కొంటున్నారని, ట్రాఫిక్ పోలీసులు ఆటో కార్మికులను వేధిస్తున్నారని ఆరోపించారు. 2019 నూతన వెహికిల్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఆటో కార్మికులకు ఏ ఆపద వచ్చిన ముందు ఉండి పోరాడుతామని నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మహేందర్, చెన్నయ్యలు అన్నారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్‌కుమార్, సీహెచ్ ప్రవీణ్‌కుమార్, గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు రత్నం తదితరులు పాలొన్నారు.

శాంతిభద్రతల నియంత్రణలో అలసత్వం తగదు

శంషాబాద్ డీసీపీ రాజేశ్



పోలీసు స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీసీపీ రాజేశ్

తలకొండపల్లి, ఆగస్టు 30: శాంతి భద్రతల పరిరక్షణలో ఎక్కడ కూడా అలసత్వానికి తావుండకూడదని శంషాబాద్ డీసీపీ బి.రాజేశ్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. తలకొండపల్లి పోలీసు స్టేషన్‌ను శుక్రవారం డీసీపీ సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, నిర్వహణ తీరు, పోలీసు స్టేషన్ ఆవరణ, సిబ్బంది పనితీరును పరిశీలించారు. అనంతరం ఏసీపీ రంగస్వామి, ఆమనగల్లు సీఐ ప్రమోద్ కుమార్, స్థానిక సీఐ శ్రీకాంత్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసులు, రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలు, కేసుల దర్యాప్తు గూర్చి అధికారులకు డీసీపీ పలు సూచనలు చేశారు. కొత్త చట్టాలను ప్రతీ పోలీసు స్టేషన్‌లో అమలు పరుచాలని ఆదేశించారు. రోడ్డు భద్రతా నియమాల ఉల్లంఘనలను ఉపేక్షించవద్దని, రోడ్డు భద్రతా నియమాలు, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలని, కేసుల్లో అరెస్ట్ కాని వారిని వెంటనే అరెస్ట్ చేయాలని ఆదేశించారు. వారెంట్లు, సమన్లు పెండింగ్‌లో ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. రాత్రీపగలు బీట్ల పనితీరును నిరంతరం మానిటరింగ్ చేసి నేరాలను నియంత్రించాలని సూచించారు. గణేశ్ నవరాత్రోత్సవాలు శాంతియుతంగా జరిగేలా చూడాలని, అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా చొరవ తీసుకోవాలని సూచించారు. అనంతరం పోలీసు సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని డీసీపీ తెలిపారు. ఎస్సై శ్రీకాంత్ పనితీరును డీసీపీ అభినందించారు.

ఉపాధ్యాయులు ఆదర్శప్రాయులు


పరిగి: చెర్క సత్తయ్యను సన్మానిస్తున్న ప్రొఫెసర్ శాంతసిన్హా, మహేశ్‌రెడ్డి తదితరులు

పరిగి, ఆగస్టు 30: ఉపాధ్యాయులు ఆదర్శప్రాయులని పలువురు కొనియాడారు. మండలంలోని సుల్తాన్‌పూర్ పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తూ శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్ చెర్క సత్తయ్యను శుక్రవారం సుల్తాన్‌పూర్‌లోని క్యూవైపె ఫంక్షన్ హాల్‌లోఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. అవార్డు గ్రహీత, ఎంవీఎఫ్ సంస్థ వ్యవస్థాపకురాలు, పద్మశ్రీ ప్రొఫెసర్ శాంతసిన్హా, పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డిలతోపాటు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని ఘనంగా సన్మానించారు. చెర్క సత్తయ్య 40 ఏళ్ళ సుదీర్ఘ ఉపాధ్యాయ ప్రస్థానంలో అందించిన సేవలను కొనియాడారు. తన సర్వీసులో ఒక్కరోజు కూడా కోపమేరుగని శాంతమూర్తి పండితుడని ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా ప్రొ.శాంత సిన్హా మాట్లాడుతూ, విద్యావిధానంలో ఇంకా మార్పులు రావాల్సిన అవసరముందన్నారు. టీచర్లల్లో అనేక సంఘాలు ఉన్నాయని, వారంతా విద్య విధానంలో మార్పునకు బాధ్యతగా కృషి చేయాల్సిన అవసరముందన్నారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి,మాజీ ఎమ్మెల్యే కె.మహేశ్‌రెడ్డిలు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమాజానికి ఆదర్శప్రాయులని, అన్ని ఉద్యోగాల కన్నా ఉపాధ్యాయ వృత్తి అతి ముఖ్యమైనదని పేర్కొన్నారు. సమాజాన్ని మార్చే బాధ్యత గల వృత్తియని పేర్కొన్నారు. సర్వీసులో ఉన్నంతకాలం బాధ్యతగా పని చేస్తే ప్రజల గుండేల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవీఎఫ్ జాతీయ కో-ఆర్డినేటర్ ఆర్.వెంకట్‌రెడ్డి, బాలల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి రఘునందన్, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్, టీటీఏ మాజీ జడ్పీవైఎస్ చైర్మన్ బి.విజయ్‌కుమార్, ఎంఈవో హరిశ్చందర్, కె.అరవింద్‌రావు, సత్యహరిశ్చంద్ర, సురేందర్, ఎం.లాల్‌కృష్ణ, గట్యానాయక్, కె.హన్మంత్‌ముదిరాజ్, ఇ.కృష్ణ, బి.ప్రవీణ్ రెడ్డి, భాస్కర్, ఆనెం ఆంజనేయులు, వెంకట్‌రాం రెడ్డి, గోవింద్‌నాయక్, రాజు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట: ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజమేనని దుద్యాల ఎంఈవో రాంరెడ్డి అన్నారు. శుక్రవారం దుద్యాల ఉర్దూ మీడియం పాఠశాల హెచ్‌ఎంగా పని చేసిన అఫ్రానస్రీన్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. విద్యాభివృద్ధికి ఆమె చేసిన సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎం విజయరామారావు, అబ్దుల్ హక్, ముస్లిం మతపెద్దలు డాక్టర్ రఫీక్, హాఫీజ్ పాల్గొన్నారు.

శామీర్‌పేట: మండలంలోని తుర్కపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేసిన రామచంద్రంను శుక్రవారం ఆ పాఠశాల ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి రామిడి వెంకట్ రాంరెడ్డి, గౌరవ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు దేవేందర్‌గౌడ్, సంఘం నాయకులు అరవింద్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, తదితర నాయకులు సన్మానించారు. అలాగే ఈ కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా విద్యాధికారి విజయకుమారిని గౌరవ సన్మానం చేశారు.

అంకితభావంతో పనిచేసేవారికి గుర్తింపు

ఘట్‌కేసర్: అంకిత భావంతో పనిచేసే అధికారులను ప్రజలు ఎప్పటికీ మరిచిపోలేరని పలువురు నాయకులు, అధికారులు అన్నారు. పోచారం మున్సిపల్ కమిషనర్ పశ్య వేమనరెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలో గల తులిప్స్ హోటల్‌లో స్థానిక మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి అధ్యక్షతన అభినందనసభ జరిగింది. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ అంచెలంచెలుగా ఎదిగి మున్సిపల్ కమిషనర్‌గా ఉద్యోగ విరమణ చేసిన వేమనరెడ్డి అందరికి ఆదర్శప్రాయుడన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మున్సిపాలిటీలకు చెందిన కమిషనర్లు, చైర్‌పర్సన్లు, స్థానిక పాలకవర్గ ప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పోచారం మున్సిపల్ కమిషనర్ వేమనరెడ్డి దంపతులను సన్మానిస్తున్న పాలకవర్గం

ప్రభుత్వ జూనియర్ కళాశాలలను బలోపేతం చేయాలి

మోమిన్‌పేట్, ఆగస్టు 30: ప్రభుత్వ జూనియర్ కళాశాలలను బలోపేతమే లక్ష్యంగా ప్రిన్సిపాల్‌లు పనిచేయాలని తెలంగాణ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కళింగ కృష్ణకుమార్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు బలోపేతం కావాల్సిన అవసరముందన్నారు. జిల్లా ఇంటర్ విద్యా శాఖ అధికారి శంకర్ నాయక్ మాట్లాడుతూ, విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే విద్యార్థులను క్రమశిక్షణగా ఉంచాలని, విద్యా బోధనపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు.

జిల్లా కార్యవర్గం ఎన్నిక


నర్సింహారెడ్డి


సురేశ్వరస్వామి

2024-26 సంవత్సరానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సంఘం జిల్లా శాఖ ఎన్నికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎస్.నర్సింహారెడ్డి (కొడంగల్), కార్యదర్శిగా ఆర్ ఎం సురేశ్వరస్వామి (నవాబుపేట్), ఉపాధ్యక్షుడిగా ఎస్.వెంకటేశ్వరరావు (వికారాబాద్), సంయుక్త కార్యదర్శిగా నర్సిములు (పెద్దేముల్), మహిళా కార్యదర్శిగా రూపాలక్ష్మి(దోమ), కార్యనిర్వాహక సభ్యుడిగా డి.బుచ్చిరెడ్డి (మోమిన్‌పేట్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు వెంకటేశం, స్వర్ణలత, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ప్రముఖ వక్త డీజీ రాంమూర్తి, వేదికపై గోరటి వెంకన్న తదితరులు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 30: జ్ఞానం తరగని సంపదని, విద్యార్థులు జ్ఞానం పెంచుకునే ప్రయత్నం చేయాలని ప్రముఖ రచయిత, కవి గోరేటి వెంకన్న అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఓరియంటేషన్ డే కార్యక్రమానికి గోరేటి వెంకన్న ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు చదువులపై ఆసక్తి కనపరిచినపుడే ఉన్నత స్థాయికి ఎదగగలరన్నారు. తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా కళాశాల వారు పిల్లలను తీర్చిదిద్దాలని కోరారు. గౌరవ అతిథులుగా విచ్చేసిన ప్రముఖ వక్త డీజీ రాంమూర్తి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సమాజానికి ఉపయోగపడే ఇతర అంశాలను తెలుసుకోవాలన్నారు. కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. సాంకేతిక రంగంలో అభివృద్ధి చెందుతున్న అన్ని అంశాలను తమ పాఠశాల విద్యార్థులకు నేర్పుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ త్రిశూల్‌రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ మోహన్‌బాబు, ప్రిన్సిపాల్ లోకనాథం, త్రిలోక్‌రెడ్డి, శైలజారెడ్డి పాల్గొన్నారు.

డైట్ గెస్ట్ లెక్చరర్ల ఎంపికను రద్దు చేయాలి


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కట్టెల మల్లేశం

వికారాబాద్, ఆగస్టు 30: ఆగస్టు 28న వికారాబాద్‌లోని డైట్ కళాశాలలో నిర్వహించిన గెస్ట్ లెక్చరర్ల ఎంపికను రద్దు చేయాలని అంబేడ్కర్ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల మల్లేశం డిమాండ్ చేశారు. కలెక్టర్‌ను శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. అతిథి అధ్యాపక ఎంపికలో అవకతవకలు జరిగాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా న్యాయ నిర్ణేతల పక్షపాత వైఖరి బంధు ప్రీతితో జరిగిందన్నారు. బోధన డెమో ఆధారంగా ఈ ఎంపిక చేస్తున్నట్లు తెలిపిన డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రతిభను గుర్తించకుండా పక్షపాత వైఖరి అవలంభించారని అన్నారు. సమాజానికి నష్టం కలిగించే ఈ ప్రిన్సిపాల్ న్యాయ నిర్ణేతలు చేపట్టిన ఎంపికను వెంటనే రద్దు చేసి తిరిగి ఎంపిక ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ ప్రజా సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు సురేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, తాండూరు డివిజన్ కార్యదర్శి బుడగ జంగం వెంకటేశ్ పాల్గొన్నారు.

అమ్మోరికి సాక


అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

శామీర్‌పేట, ఆగస్టు 30 : శ్రావణ శుక్రవారం సందర్భంగా శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద కట్టమైసమ్మ అమ్మవారికి భక్తులు పూజల చేశారు. వివిధ పార్టీల నాయకులు, మహిళలు, భారీగా తరలివచ్చి దర్శించుకున్నారు. అమ్మవారికి సాకలు పెట్టి, పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


దోమ: చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మేడ్చల్ టౌన్: మేడ్చల్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధి దారులకు ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి చెక్కులను పంపిణీ చేశారు. మండలపరిషత్ కార్యాలయంలో శుక్రవారం చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలతో పాటు మండలంలోని గ్రామాలకు చెందిన దాదాపు 100 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ వైస్‌చైర్మన్ రమేష్, గుండ్లపోచంపల్లి వైస్‌చైర్మన్ ప్రభాకర్ కౌన్సిలర్లు దొడ్డ మల్లికార్జున్ ముదిరాజ్, హేమంత్ రెడ్డి, నడికొప్పు ఉమానాగరాజు, తుడుమ్ గణేష్, బీఆర్ఎస్ నాయకులు భాస్కర్ యాదవ్, మద్దుల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

దోమ, ఆగస్టు 30: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలతో పేద కుటుంబాలకు భరోసా కల్పిస్తున్నట్లు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 35 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రైతు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కుతుందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి హనుమంత రావు, తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో మహేశ్‌బాబు పాల్గొన్నారు.

తగాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలి


దోమ: కిష్టాపూర్‌లో పౌర హక్కుల దినోత్సవంలో మాట్లాడుతున్న ఎస్ఐ ఆనంద్‌కుమార్

దోమ, ఆగస్టు 30: చిన్నచిన్న తగాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని దోమ ఎస్ఐ ఆనంద్‌కుమార్ అన్నారు. మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో శుక్రవారం పౌరహక్కులపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

బొంరాస్‌పేట్: మండలంలోని మెట్లకుంట గ్రామంలో పౌర హక్కుల దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై అబ్దుల్ రవూఫ్ గ్రామస్థులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, అంటరానితనం, అస్పృశ్యత నివారణ తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది శంకర్, సిద్దు పాల్గొన్నారు.

బషీరాబాద్: జీవన్గి గ్రామంలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వెంకటేష్ స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో బషీరాబాద్ ఏఎంసీ చైర్మన్ జి.మాధవరెడ్డి, మాజీ ఏఎంసీ వైస్‌చైర్మన్ కె.మాణిక్‌రెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు రాములు, ఎస్సీ హాస్టల్ మెట్రిన్ రాధిక, గ్రామకార్యదర్శి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: గ్రామాల్లో ప్రతీ ఒక్కరు కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి ఉండాలని తహసీల్దార్, మాజీ సర్పంచ్ రత్నం అన్నారు. మండలంలోని గేటువనంపల్లి గ్రామంలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు చట్టాలపై అధికారులు గ్రామస్థులకు అవగాహన కల్పించారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమా?

ఘట్‌కేసర్, ఆగస్టు30: పోచారం మున్సిపాలిటీ సంస్కృతీ టౌన్‌షిప్‌లో నిర్మిస్తున్న పల్లవీ ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణ పనులు కొనసాగుతుండగానే తరగతులు నిర్వహిస్తున్న స్కూల్ యాజమాన్యంపై కఠినచర్యలు తీసుకోవాలని మున్సిపల్ కౌన్సిలర్ బాలగోని వెంకటేష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం అన్నోజిగూడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్కూల్ నిర్మాణం పూర్తికాకుండానే తరగతులు నిర్వహించడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. భవనాలకు ఎలాంటి ఎన్వోసీలుగానీ, ఆక్యూపెన్సీ సర్టిఫికెట్లు పొందకుండానే తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. భద్రతా నిబంధనలు పాటించకుండా పసిపిల్లల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని వాపోయారు. ఈస్కూల్‌పై సంస్కృతీ టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ నిర్వాహకులు కోర్టును ఆశ్రయించడంతో కోర్టు స్టేటస్కో ఉత్తర్వులు ఇచ్చినట్లు వివరించారు. ఈవిషయమై విచారణ జరిపి స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు కౌన్సిలర్ వెంకటేష్ గౌడ్ వివరించారు.

రెడ్డిఘణాపూర్ పాఠశాలను సందర్శించిన జిల్లా విద్యాధికారి

బషీరాబాద్, ఆగస్టు 30: మండలంలోని రెడ్డిఘణాపూర్ పాఠశాలలను జిల్లా విద్యాధికారి రేణుకాదేవి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రాథమిక, జడ్పీ ఉన్నత పాఠశాలల్లోని తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. అక్కడి ఉపాధ్యాయులతో సమయ పాలన పాటిస్తూ విధిగా పాఠశాలలకు హాజరుకవాలని సూచిస్తూ సమస్యలపై ఆరా తీశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పలు పనులపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ పలు మండలాల్లో బదిలీపై ఉపాధ్యాయులు ఇతర పాఠశాలలకు వెళ్లడంతో కొంత టీచర్ల కొరత ఉందన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేరని, త్వరలో సర్దుబాటు చేసి కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఆమె వెంట బషీరాబాద్ విద్యాధికారి సుధాకర్‌రెడ్డి తదితరులున్నారు.

సంక్షిప్తంగా..

- **మోమిన్‌పేట్:** మోమిన్‌పేట్ ఎంపీడీవోగా విజయలక్ష్మి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆమె దౌల్తాబాద్‌నుంచి బదిలీపై వచ్చారు.
- **మేడ్చల్ టౌన్:** కిష్టాపూర్ మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం యాంటీ నార్కోటిక్ డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ సీఐ సత్యనారాయణ పాల్గొన్నారు.
- **బషీరాబాద్:** సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 3 వరకు నిర్వహించనున్న ఏకాంబర రామలింగేశ్వరుడి జాతరకు హాజరు కావాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని శుక్రవారం ఆలయ కమిటీ చైర్మన్ పి.గోపాల్‌రెడ్డి, గ్రామ పెద్దలతో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.
- **పరిగి:** భారీవర్షాల పట్ల పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ అన్నారు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న కాలనీలను శుక్రవారం ఆయన పర్యటించారు. ఆయన వెంట కమిషనర్ వెంకటయ్య ఉన్నారు.
- **మోమిన్‌పేట్:** శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం శని త్రయోదశిని పురస్కరించుకొని మండలంలోని ఎన్కతల గ్రామంలో శ్రీశనీశ్వరస్వామికి భక్తులు తైలాభిషేకం నిర్వహించారు.
- **ధారూరు:** ధారూరులోని వీరభద్రేశ్వర ఆలయంలో సెప్టెంబర్ 1న (ఆదివారం) లక్షబిల్వార్చన పూజా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.
- **బొంరాస్‌పేట్:** బురాన్‌పూర్‌లో యువకులు అనంతగిరి సేంద్రియ ఎరువుల కర్మాగారాన్ని శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కర్మాగారం యజమాని వెంకట్ నర్సిములు, రాజుగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, నాయకులు పాల్గొన్నారు.
- **కొడంగల్:** రుద్రారం గ్రామానికి చెందిన వడ్ల రాములు, బుగ్గయ్యగౌడ్ ఇటీవల మృతి చెందారు. వారికి శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ తాండూర్ బ్రాంచీలో ఇన్సూరెన్స్ పాలసీ ఉండటంతో ఆ కుటుంబాలకు శుక్రవారం రూ.5,80,285, రూ.5,87,250 జీవిత బీమా చెక్కులను నామినీలు ఈడిగి లక్ష్మీ, వడ్ల అనురాధకు అందజేశారు. జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సీతాదేవి, అధికారులు పాల్గొన్నారు.
- **కొడంగల్ రూరల్:** మండలంలోని ఎన్కేపల్లి గ్రామంలో శుక్రవారం కేన్సర్ వ్యాధి నిర్ధారణ వైద్య శిబిరం నిర్వహించారు. ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి వైద్యులు ప్రసాద్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం శ్రీసత్యసాయి భజనమండలి కొడంగల్ సమితి, ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి హైదరాబాద్ వారి సౌజన్యంతో 126 మందికి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.
- **బొంరాస్‌పేట్:** మండలంలోని అన్ని పాఠశాలలకు మధ్యాహ్న భోజనం కోసం ఎండీఎం రైస్‌ను అందించాలని ఉపాధ్యాయులు ఇన్‌చార్జి నోడల్ అధికారి రవీందర్‌గౌడ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు గౌరారం గోపాల్, నాయకులు పాల్గొన్నారు.
- **ఘట్‌కేసర్:** ప్రశాంత వాతావరణంలో వినాయక ఉత్సవాలను జరుపుకోవాలని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ సైదులు అన్నారు. శుక్రవారం ఘట్‌కేసర్‌లోని నారాయణ గార్డెన్‌లో నిర్వహించిన వినాయక ఉత్సవాల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు.
- **కొడంగల్ రూరల్:** అక్రమ ఇసుక తరలింపును నిరోధించాలని ఎంబీఎం కొడంగల్ తాలుకా అధ్యక్షుడు ఎస్పీ. గుల్షన్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వ్యాపారులు అర్ధరాత్రి ట్రాక్టర్లలో ఫిల్టర్ ఇసుకతో పాటుగా వాగుల్లో నుంచి ఇసుకను అనుమతులు లేకుండా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.
- **బషీరాబాద్:** తాగునీటి సమస్యలతో పాటు పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారిందని మండలంలోని వాల్యానాయక్‌తండా గిరిజనులు ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీడీవో గాలి యాదయ్యను శుక్రవారం కలిసి పలు సమస్యలపై మొరపెట్టుకున్నారు.
- **బషీరాబాద్:** పెట్రోల్ బంక్‌ను తన స్వంత పొలంలో ఏర్పాటు చేస్తామని అగ్రిమెంట్ చేసుకుని వేరొకచోటుకి ఎలా మారుస్తారని బాధిత రైతు కోటప్ప గ్రామస్తులతో కలిసి శుక్రవారం నవాంద్గీ సొసైటీ ఎదుట నిరసనకు దిగాడు.
- **పరిగి:** శిక్షణ ఫౌండేషన్ ప్రతినిధి పి.కవిత శుక్రవారం ఎఫ్ఎల్ఎన్ మెటీరియల్‌ను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు.
- **బంట్వారం:** రొంపల్లి గ్రామ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత కారణంగా విద్యార్థులకు సరైన విద్య అందడం లేదని మాజీ ఎంపీటీసీ శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం ఎంఈవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.
- **మేడ్చల్ టౌన్:** మేడ్చల్ 33 బై 11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం చేపడుతున్న మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు.
- **శామీర్‌పేట:** అలియాబాద్ గ్రామానికి చెందిన గాదె సత్తయ్య కూతురు వివాహాన్ని కుటుంబీకులు నిశ్చయించారు. వీరిది పేద కుటుంబం కావడంతో మాజీ సర్పంచ్ గుర్క కుమార్ శుక్రవారం గాదె సత్తయ్య కూతురుకు పుస్తె, మట్టెలను విరాళంగా అందజేశారు.
- **మర్పల్లి/కొడంగల్:** రేషన్ కార్డులు లేని రైతుల వివరాలను సేకరించి రుణమాఫీ వర్తించేలా చర్యలు తీసుకుంటున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీకాంత్ అన్నారు. మండలంలోని పట్లూర్ క్లస్టర్ పరిధిలో శుక్రవారం రుణమాఫీ కాని రైతుల వివరాలను సేకరించారు. రైతులకు రుణమాఫీ వర్తించకుంటే వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. అదేవిధంగా కొడంగల్ పరిధి రావుల్‌పల్లిలో వ్యవసాయ శాఖ అధికారి శంకర్‌రాథోడ్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది రుణమాఫీ కాని రైతుల వివరాలను శుక్రవారం సేకరించారు.
- **పూడూరు/మర్పల్లి/శామీర్‌పేట:** మన్నెగూడలో శుక్రవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సదానందరెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు పల్లేష్ పటేల్ హాజరయ్యారు. అదేవిధంగా మర్పల్లి బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామ కమిటీలు, బూత్ కమిటీలను త్వరలోనే నియమిస్తామన్నారు. అదేవిధంగా శామీర్‌పేట్‌లో మేడ్చల్ జిల్లా సభ్యత్వ నమోదు కన్వీనర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుద్ధి శ్రీనివాస్ మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ జిల్లా సభ్యత్వ నమోదు కన్వీనర్ బుద్ది శ్రీనివాస్ విచ్చేశారు.

క్రైం కార్నర్

రుద్రారంలో భారీ చోరీ

- తాళం వేసిన ఇంటికి కన్నం వేసిన దొంగలు
- 20 తులాల బంగారం, 10 తులాల వెండి అపహరణ


వివరాలు సేకరిస్తున్న క్రైం సీఐ బలవంతయ్య


దుండగులు పగులకొట్టిన బీరువా

పెద్దేముల్, ఆగస్టు 30: మండలంలోని రుద్రారంలో భారీ చోరీ జరిగింది. దైవదర్శనానికి వెళ్లి తిరిగి వచ్చేసరికి దుండగులు సుమారు 20 తులాలు బంగారం, 10 తులాల వెండిని అపహరించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రారం గ్రామానికి చెందిన మండలపరిషత్ మాజీ వైస్‌ఎంపీపీ, ప్రముఖ సుద్దవ్యాపారి అయిన గోపాల్‌రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి ఈనెల 28న ఉదయం యాదగిరిగుట్టలో లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు ఇంటికి తాళం వేసి వెళ్లారు. ఇది గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఇంటి ప్రధాన ద్వారాన్ని తెరిచేందుకు ముందుగా తలుపునకుపెట్టిన చిలుకును తొలగించేందుకు ప్రయత్నించారు. అది రాకపోవడంతో తాళం విరగ్గొట్టకుండానే తాళం తీశారు. లోపలికి వెళ్ళి తలుపుమూసి చిలుకుపెట్టారు. పైఅంతస్తులో ఉండే గదిలోకి వెళ్లి బీరువా పగులగొట్టి బంగారు, వెండి వస్తువులు దొంగిలించారు. గురువారం రాత్రి 12గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చిన గోపాల్‌రెడ్డి దంపతులు ప్రధాన ద్వారానికి తాళం లేకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. తలుపుతెరిచేందుకు ప్రయత్నించినా తలుపురాలేదు. దీంతో వారి కారుడ్రైవర్ నర్సింహులును మెట్లపైనుంచి వెళ్లి చూడమని చెప్పడంతో అతడు పైకివెళ్ళి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో ఇది దొంగలపనేనని వెంటనే పోలీసులకు ఫోన్‌చేసి విషయాన్ని వివరించారు. సమాచారం అందుకున్న వెంటనే పెద్దేముల్ ఎస్ఐ గిరి అదేరాత్రి తనసిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని విచారణ జరిపారు. ఉదయం తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, రూరల్ సీఐ. అశోక్‌కుమార్ క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌ను పిలిపించి విచారణ చేపట్టారు. బాధితుల నుంచి వివరాలు సేకరించారు. సుమారు 20 తులాల బంగారం, 10 తులాల వెండి చోరీజరిగినట్లు గోపాల్‌రెడ్డి దంపతులు తెలిపారు. ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. క్లూస్‌టీం సీఐ, క్రైం సీఐలు కూడా సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ జరిపారు.

తీసుకున్న డబ్బు తిరిగివ్వలేదని హత్య

- రూ.20వేల కోసం దారుణం ● మర్డర్ మిస్టరీని ఛేదించిన పోలీసులు


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 30: మేడ్చల్ పట్టణంలో జరిగిన యువకుడి హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వటానికి నిరాకరించటంతో హత్యకు పాల్పడినట్లు నిందితులు ఒప్పుకున్నట్టు పోలీసులు తెలిపారు. మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం హత్యకు గురైన టి.కల్యాణ్(26) స్థానిక పారిశ్రామిక వాడలోని కేఎంపీ పరిశ్రమలో ప్లంబర్‌గా పని చేస్తున్నాడు. కల్యాణ్‌కు పరిశ్రమలో కార్పెంటర్‌గా పనిచేసే గౌడవెల్లి గ్రామానికి చెందిన ఎస్.శివకుమార్ (26)తో పరిచయం ఏర్పడింది. మూడు నెలల కిందట శివకుమార్ కేఎంపీ పరిశ్రమలో పనిమానేసి సొంతంగా బయట కార్పెంటర్ పనులు చేయడం సాగించాడు. ఓరోజు శివకుమార్ ఇంటికి వచ్చిన కల్యాణ్ డ్రాలో దాచిన రూ.20వేలు తీసుకెళ్లాడు. దాచిన డబ్బు కనిపించకపోవడంతో శివకుమార్ డబ్బుల గురించి కల్యాణ్‌ను నిలదీయగా అవసరముండి డబ్బులు తీసుకున్నట్లు ఒప్పుకున్నాడు. తీసుకున్న డబ్బులు తిరిగి ఇస్తానని చెప్పి డబ్బులు ఇవ్వకపోగా ఫోన్ కాల్ ఎత్తలేదు. దీంతో ఎలాగైనా కల్యాణ్‌ను పట్టుకుని డబ్బులు వసూలు చేయాలని కుమార్ తన సోదరుడు మహేందర్, బావమర్ది సాయికుమార్‌లతో విషయాన్ని చెప్పాడు. ఈనెల 28వ తేదీన కల్యాణ్ పట్టణంలోని భాను తేజ వైన్‌లో మద్యం సేవిస్తున్నాడని తెలిసి ముగ్గురూ అక్కడికి వెళ్లి డబ్బులు ఇవ్వాలని అడిగారు. తన వద్ద డబ్బులు లేవని కల్యాణ్ చెప్పడంతో ఆగ్రహించిన ముగ్గురు అతడిని చితకబాదారు. అనంతరం వైన్స్ నుంచి హాస్టల్ వద్దకు తీసుకొచ్చి మరోసారి విచక్షణా రహితంగా గ్యాస్‌వైర్లతో కొట్టారు. దీంతో కల్యాణ్ అపస్మారక స్థితికి చేరుకొని మృతిచెందాడు. పరిస్థితి గమనించిన ముగ్గురు అక్కడి నుంచి పరారయ్యారు అనంతరం పోలీసులు, క్లూస్ టీం చేపట్టిన దర్యాప్తుతో నిందితుల ఆచూకీ కనుగొని పట్టుకున్నామని ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నిందితులు ముగ్గురు గౌడవెల్లి గ్రామానికి చెందిన వారని తెలిపారు. ఈ సమావేశంలో మేడ్చల్ సీఐ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఓక్‌వుడ్ ఫామ్‌హౌజ్ సీజ్


ఓక్‌వుడ్ ఫామ్‌హౌజ్‌ను సీజ్ చేస్తున్న కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్, సీఐ వెంకటయ్య

కీసర రూరల్, ఆగస్టు 30: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య హెచ్చరించారు. కీసర పోలీస్‌స్టేషన్ పరిధి యాద్గార్‌పల్లి గ్రామంలోని ఓక్‌వుడ్ ఫామ్‌హౌజ్‌ను శుక్రవారం తహసీల్దార్ అశోక్‌కుమార్ సమక్షంలో సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 3వ తేదీన కాప్రాకు చెందిన రాగిడి సందీప్‌రెడ్డి(29) అనే వ్యక్తి ఓక్‌వుడ్ ఫామ్‌హౌజ్‌లోని స్విమింగ్ పూల్‌లో పడి మృతిచెందాడు. మృతుడి బంధువు రాగిడి దిలీప్‌రెడ్డి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. ఓక్‌వుడ్ ఫామ్‌హౌజ్ నిర్మాణం, నిర్వహణకు సంబంధించిన అనుమతులు సక్రమంగా లేనందున కీసర ఆర్డీవో ఆదేశాల మేరకు తహసీల్దార్ అశోక్‌కుమార్ సమక్షంలో సీజ్ చేసినట్లు వివరించారు. వ్యవసాయ క్షేత్రాల వద్ద నిర్మించుకున్న గృహాలను డబ్బులకు కక్కుర్తిపడి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించిన వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు ఉన్న వాటినే అద్దెకు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కీసర సెక్టార్ ఎస్ఐ వెంకటేష్ పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

కులకచర్ల, ఆగస్టు 30: కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని బొంరెడ్డిపల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన చెన్నయ్య(28) శుక్రవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గతంలో చెన్నయ్యకు వివాహం జరగగా ఓ కుమారుడు ఉన్నాడు. అయితే ఆమెతో దూరంగా ఉంటూ మొత్కుర్ గ్రామానికి చెందిన బంధువుల అమ్మాయిని రెండో పెళ్లి చేసుకున్నాడు. రెండో భార్యతో హైదరాబాద్‌లో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. అయితే రెండు రోజుల కిందట గ్రామానికి వచ్చిన చెన్నయ్య శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండో భార్య హరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ జైపాల్‌రెడ్డి తెలిపారు.

ఆలయ హుండీ పగలగొట్టిన నిందితుడి గుర్తింపు


నిందితుడు కిష్టప్ప

తాండూరు రూరల్, ఆగస్టు 30: కొత్లాపూర్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయ హుండీ ఈనెల 27వ తేదీన రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పగలగొట్టారు. దీంతో స్థానికులు 28వ తేదీన కరన్‌కోట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఆలయానికి వెళ్లి విచారణ జరిపారు. కొత్లాపూర్ గ్రామానికి చెందిన ఎర్ర కిష్టప్ప అనే వ్యక్తిని పట్టుకుని విచారించగా హుండీ పగలగొట్టి చోరీకి యత్నించినట్లు తేలింది. కిష్టప్ప గతంలో నాలుగు కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. కిష్టప్ప నేరం ఒప్పుకోవడతో కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

బదిలీపై వెళ్తున్న ఎస్ఐకి వీడ్కోలు

మూడుచింతలపల్లి/శామీర్‌పేట్, ఆగస్టు 30: అంకితభావంతో పని చేసే అధికారులు ప్రజల మనస్సుల్లో ఎప్పటికీ నిలిచిఉంటారని శామీర్‌పేట్ పోలీసులు అన్నారు. శామీర్ పేట్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న మునీందర్ ఇటీవల బదిలీపై నార్సంగికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా శుక్రవారం శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించి ఆయనను శాలువాలతో సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో డీఐ గంగాధర్, ఎస్ఐలు పరశురామ్, హారిక, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.